క్లుప్తంగా

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు



నిందితుడు చంద్రశేఖర్‌తో ఎక్సైజ్ పోలీసులు

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తున్న కట్టుపాలెం గ్రామానికి చెందిన పండూరి చంద్రశేఖర్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్టు అనకాపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టీవీ అప్పలనాయుడు తెలిపారు. నిందితుడి నుంచి 49 మద్యం బాటిళ్లు, వాటిని తరలిస్తున్న టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితుడితో పాటు స్వాధీనపర్చుకున్న మద్యం బాటిళ్లను యలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు అప్పగించినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

10 మద్యం బాటిళ్ల స్వాధీనం

మునగపాక: మునగపాక నుంచి అరబుపాలెం కు వెళ్లే దారిలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అనకాపల్లి ఎక్సైజ్ అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. అరబుపాలెం గ్రామానికి వెళ్లే దారిలోని అయ్యప్పస్వామి ఆలయం వెనకన మద్యం విక్రయాలు చేస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు అనకాపల్లి ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో మద్యం విక్రయిస్తున్న బొడ్డేడ వీరప్పారావును అరెస్టు చేశారు. అతని నుంచి 10 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు వైఎల్ నాయుడు, కేఎస్ గణేష్ తెలిపారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

మునగపాక: విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ ఏఈ గోపీకృష్ణ తెలిపారు. మునగపాక ఎస్‌బీఐ దరి దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను ఆయన మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంతో పాటు గృహ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరా విషయంలో అంతరాయం కలిగితే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

శ్మశానవాటికల్లో తుప్పల తొలగింపు

మునగపాక: మండలంలోని తోటాడ, గవర్ల అనకాపల్లి శ్మశానవాటికలను అభివృద్ధి చేసేందుకు అవసరమయ్యే చర్యలు తీసుకుంటున్నట్లు వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం తోటాడ శ్మశానవాటికలో పేరుకుపోయిన తుప్పల తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశానవాటికల అభివృద్ధికి పాలకవర్గం పాటుపడుతుందన్నారు. ప్రజలు కూడా తోటాడ పంచాయతీ అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాపేటి పరమేష్, బుద్ద రవి, పోలినాటి మహాలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కోరారు. మండలంలోని అరబుపాలెంలో మంగళవారం చేపట్టిన తుప్పల తొలగింపు పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరబుపాలెం గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకవర్గ సభ్యులందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. తుప్పలు పేరుకుపోతే విష సర్పాలు సంచరించే ప్రమాదం ఉందన్నారు. ఇందుకోసం తగు చర్యలు తీసుకుంటున్నామని శ్రీనివాసరావు తెలిపారు.

20 నుంచి సీపీఎం మహాసభలు

అచ్యుతాపురం: ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు నర్సీపట్నంలో నిర్వహించనున్న సీపీఎం మహాసభల పోస్టర్‌ను మంగళవారం అచ్యుతాపురంలో ఆవిష్కరించారు. ప్రజా, కార్మిక సమస్యల పరిష్కారమే అజెండాగా నిర్వహిస్తున్న ఈ మహాసభలను అనకాపల్లి జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారి నిర్వహిస్తున్నామని సీపీఎం నాయకులు తెలిపారు. ఆర్.రాము, కె.రామ సదాశివరావు, కె.సోమునాయుడు, కర్రి అప్పారావు, సన్యాసిరావు, మోహన్ రావు, నాయుడు, అప్పారావు, సన్నిబాబు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కుక్కలు భౌబోయ్

- పట్టణంలో హడలెత్తిస్తున్న వీధి శునకాలు
- రోడ్లపై గుంపులుగా సంచారం
- రాత్రి వేళ రోడ్లపైకి రావాలంటేనే భయపడుతున్న జనం
- అటకెక్కిన యానిమల్ బర్త్ కంట్రోల్ ప్రోగ్రాం



ప్రధాన రహదారిపై ఎస్‌బీఐ కూడలి వద్ద గ్రామ సింహాలు ఇలా..



యలమంచిలి రూరల్: కుక్కల నియంత్రణపై దృష్టి సారించకపోవడంతో వాటి సంతతి విపరీతంగా పెరిగిపోయింది. కుక్క పిక్క పీకితే లబోదిబోమంటూ నిత్యం పదుల సంఖ్యలో బాధితులు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. యలమంచిలి పట్టణం శివారు గ్రామాల్లో వీధు కుక్కల దాడులు ప్రజానీకాన్ని కలవరపరుస్తున్నాయి. పదుల సంఖ్యలో గుంపులుగా రోడ్లపై తిరుగుతూ పిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్రవాహనదారులను వెంబడించి పరుగులు పెట్టిస్తున్నాయి. రాత్రి వేళల్లో మనుషులు కనిపిస్తే చాలు దాడులు చేసి గాయపరుస్తున్నాయి.

గుంపులుగా సంచారం

నియోజకవర్గ కేంద్రమైన యలమంచిలి పట్టణంలో ఎక్కడ చూసినా వీధి కుక్కల బెడద ఎక్కువైంది. గుంపులు,గుపులుగా తిరుగుతూ చిన్నా,పెద్దా తేడా లేకుండా ప్రజలను కరిచి గాయపరుస్తున్నాయి. పట్టణంలో స్టేషన్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్సు, దిమిలి రోడ్డు, ఎల్ఐసీ కూడళ్లు, ధర్మవరం, కొత్తపేట, తులసీనగర్, సైతారుపేట రోడ్డు, రాంనగర్, పాత ఎర్రవరం, పెదపల్లి జంక్షన్, అల్లూరి సీతారామరాజు, ఎన్టీఆర్, ఫైర్ ఆఫీస్ కాలనీలు, శివారు గ్రామాల్లో ప్రధాన వీధుల్లో కుక్కల సంతతి పెరిగిపోయింది. ఒకేచోట డజను వరకు శునకాలు తిష్టవేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

కానరాని నియంత్రణ చర్యలు

మూడేళ్లకోసారి వీధి కుక్కల నియంత్రణ కోసం యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) కార్యక్రమాన్ని చేపట్టాల్సిన మున్సిపల్ అధికారులు ఎక్కడా ఆ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో వీధి కుక్కల సంతతి గణనీయంగా పెరిగిపోయింది. ఏబీసీ కార్యక్రమంలో భాగంగా ఆడ కుక్కలకు గర్భసంచి తీసివేస్తారు. మగ కుక్కలకు క్యాస్ట్రేషన్ చేస్తారు. అయితే ఈ కార్యక్రమం పూర్తిగా అటకెక్కిందనే విమర్శలు ఉన్నాయి. పెంపుడు కుక్కలకు యజమానులు యాంటీ రేబిస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) వేయిస్తున్నారు. వీధి కుక్కలకు కూడా ఏఆర్‌వీ వేయించాల్సిన పురపాలక అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఇటీవల జరిగిన రెండు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సభ్యులు లేవనెత్తారు. అందరూ ఆమోదం కూడా తెలిపారు. అయినా చర్యలు తీసుకోవడంలో ఇంకా జాప్యం జరుగుతోంది.

రెండు నెలల్లో 300 మంది బాధితులు

గడచిన రెండు నెలల్లో యలమంచిలి పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన 300 మందికి పైగా కుక్కల దాడిలో గాయపడ్డారు. వీరిలో ఎక్కువ మంది వృద్ధులు, పిల్లలు ఉన్నారు. కుక్క కాటుకు గురైతే వెంటనే యాంటీ రేబిస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) వేయించుకోవాలి. లేకపోతే రేబిస్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంటుంది. కుక్క కాటు బాధితుడు మూడు లేదా ఐదు డోసులు తీసుకోవాల్సి ఉంటుంది. సాధారణ కుక్క కాటుకు కరిచిన రోజు, మూడో రోజు, ఏడో రోజు వ్యాక్సిన్ ఇస్తారు. కుక్క కరిచినప్పుడు రక్త గాయమైతే అదనంగా 14వ రోజు, 28వ రోజు కూడా ఏఆర్‌వీ డోసులు తీసుకోవాల్సి ఉంటుంది.



యలమంచిలి కోర్టుపేట వీధిలో శునకాల స్వైర విహారం

రోజుకు ఐదుగురు బాధితులు



ఇటీవల పట్టణంలో వీధి కుక్కలు బాగా పెరిగిపోయాయి. ప్రతి రోజూ నలుగురి నుంచి ఐదుగురు కుక్కకాటు బాధితులు ఆస్పత్రికి చికిత్స కోసం వస్తున్నారు. కుక్కకాటుతో వచ్చే రేబిస్ వ్యాధి ప్రాణాంతకం. వ్యాధి సోకితే చికిత్స లేదు. కుక్క కరిచిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. కుక్కకాటుకు ఆస్పత్రిలో మందులున్నాయి.

– డాక్టర్ సుభాష్, వైద్యాధికారి, యలమంచిలి సామాజిక ఆస్పత్రి

కుక్కల సంతతి పెరిగిపోయింది



కుక్కల సంతతి పెరిగిపోవడంతో ఏ వీధిలో చూసినా శునకాలే కనిపిస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులపై దాడి చేస్తున్నాయి. వాటి బెడద నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్య అధికారులదే.

– తాటిపాకల మాణిక్యాలరావు, ధర్మవరం, యలమంచిలి

నడిచి వెళ్లాలంటే భయమేస్తోంది..



మా వీధిలో శునకాలు గుంపులుగా తిరుగుతున్నాయి. రోడ్లపై నడిచి వెళ్లాలంటేనే భయమేస్తోంది. రాత్రి సమయాల్లో పరిస్థితి మరీ దారుణం. వీధుల్లో ఒంటరిగా వెళ్లే పరిస్థితి లేదు. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– షేక్ ఆషియా, గాంధీనగరం, యలమంచిలి

వారంలోగా నియంత్రణ చర్యలు



పట్టణంలో వీధి కుక్కల నియంత్రణకు వారం రోజుల్లోగా చర్యలు తీసుకుంటాం. వీధి కుక్కలకు ఏఆర్వీ వ్యాక్సిన్ వేయించడంతో పాటు సంతతి తగ్గించడానికి శస్త్ర చికిత్సలు చేయించడానికి రూ.2.14 లక్షలతో టెండర్లు పిలిచాం. హరియాణా రాష్ట్రానికి చెందిన స్నేహ ఏజెన్సీకి కుక్కల నియంత్రణ పనులు అప్పగించాం. త్వరలోనే వీధి కుక్కల బెడద నుంచి ప్రజలకు ఉపశమనం కలగనుంది.

– బీజేఎస్ ప్రసాదరాజు, మున్సిపల్ కమిషనర్

ఇసుక లారీ పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక లారీ

మునగపాక: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని మునగపాక పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని తోటాడ సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా లారీతో ఇసుక తరలిస్తున్నారంటూ అందిన ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి మునగపాక పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో అనధికారికంగా ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వాహనాన్ని అప్పగించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువులు, పురుగు మందు దుకాణంలో తనిఖీ చేస్తున్న శ్రీదేవి

ఎస్.రాయవరం: మండలంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను నర్సీపట్నం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు టి.శ్రీదేవి మంగళవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో విక్రయిస్తున్న ఎరువులు, పురుగు మందుల గురించి ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. నాశిరకం పురుగు మందులు, కాలం చెల్లినవి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. దుకాణదారులకు లైసెన్స్ తప్పనిసరని చెప్పారు ఈ కార్యక్రమంలో ఏవో సౌజన్య పాల్గొన్నారు.

రెండు కేజీల వెండి ఆభరణాల చోరీ

యలమంచిలి రూరల్: పట్టణంలోని రామ్మూర్తినగర్‌లో దాడి రమేష్ ఇంట్లో జరిగిన చోరీపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై సావిత్రి మంగళవారం రాత్రి తెలిపారు. ఈ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు బీరువాలో భద్రపరిచిన వివిధ రకాల వెండి వస్తువులను అపహరించుకుపోయినట్టు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఆమె తెలిపారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు



కుమారపురంలో తహసీల్దార్ సత్యనారాయణకు సమస్యలు విన్నవించుకుంటున్న రైతులు



నక్కపల్లి సదస్సులో తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతులు



రజాల రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దారు వెంకట్

మునగపాక: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సులలో పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. మండలంలోని మడకపాలెంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో భూసమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, నేడు అధికారులే గ్రామాల్లోకి వచ్చి రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో జరిగే సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాజుల వెంకటరావు, రైతులు చిరంజీవి, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: రైతుల భూసమస్యలు రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కారమవుతున్నాయని తహసీల్దార్ జి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని కుమారపురం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ భూసమస్యలపై అర్జీలు పెట్టుకున్నారు. వెంటనే పరిశీలించి సమస్య పరిష్కారానికి తహసీల్దార్ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ త్రినాథ్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, రీసర్వే డీటీ రాజేంద్రప్రసాద్, వీఆర్‌వో టి.అప్పారావు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల: పి.కె.పల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు తిరుమలబాబు మాట్లాడుతూ పట్టాదారు పాసు పుస్తకాలు, ఆన్‌లైన్ సమస్యలపై ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని తెలిపారు. ఈ సదస్సులో 80 అర్జీలు రాగా.. సర్వే కోసం 22, మ్యుటేషన్ కోసం 40, ఇతర సమస్యలపై 18 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. సర్పంచ్ బెన్నమ్మ, వీఆర్‌ఓ

రాంబిల్లి(యలమంచిలి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉప తహసీల్దారు వెంకట్ అన్నారు. రాంబిల్లి మండలం రజాల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డీటీ రైతుల నుంచి 28 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాసు పుస్తకాలు, అడంగల్ పేర్లు సవరణ, సర్వే రిపోర్టులు, తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

నక్కపల్లి సదస్సులో..

నక్కపల్లి: స్థానిక సచివాలయంలో రెవెన్యూ సదస్సు జరిగింది. 16 అర్జీలు అందాయి. నక్కపల్లి సర్వే నెంబరు 237/2, సర్వే నెంబరు 70, 71, 80/1, 2 సర్వే నెంబరు 240లలోగల జిరాయితీ భూములను ప్రభుత్వ భూములుగా గుర్తించి 22 ఏ రిజిస్టర్‌లో నమోదు చేశారని వైస్ ఎంపీపీ వీసం నానాజీ, మీగడ సత్తిబాబు, అల్లాడ కొండబాబు, మేడేటి శంకర్ తదితరులు తహసీల్దార్ నర్సింహమూర్తికి ఫిర్యాదు చేశారు. దేవదాయశాఖ భూమిగా నమోదు కావడం వల్ల క్రయవిక్రయాలు జరగడం లేదని, 22 ఏ రిజిస్టర్ నుంచి తొలగించాలని పదేళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ఈ వ్యవహారం ఎండోమెంట్ కమిషనర్ దృష్టిలో ఉన్నందువల్ల మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. సదస్సులో సర్పంచ్ నేతల జయరత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేయాలి

మునగపాక: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరిసాగు చేసే రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మునగపాక వీఏఏ సింధూజ ఒక ప్రకటనలో తెలిపారు. తుపాను ప్రభావంతో 11, 12 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం వరి కోతలను వాయిదా వేసుకోవాలని, అలాగే కోసిన పనలను కుప్పలుగా వేసుకోవాలని సూచించారు.

రూ.3 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

ఎస్.రాయవరం : మండలంలో మేజర్ పంచాయతీ గోకుల పాడులో రూ.3 లక్షలతో శ్మశానవాటికను అభివృద్ధి చేస్తున్నట్లు సర్పంచ్ కర్రి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం పనులను ఆయన కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి కోటా కింద మంజూరైన నిధుల నుంచి ఈ పనులు చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు. శ్మశానవాటికలో షెడ్డు, నీరు, తదితర సదుపాయాలు కల్పిస్తామన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక: మూఢ నమ్మకాలను విడనాడాలని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్ఐ పి.ప్రసాదరావు అన్నారు. మండల పరిషత్ హాలులో మంగళవారం కిశోరి వికాసంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండేలా తల్లిదండ్రులతో పాటు గ్రామాల్లో విధులు నిర్వహించే అధికారులు కూడా దృష్టి సారించాలన్నారు. డాక్టర్ విమలగిరి మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాలికలు ఆరోగ్యవంతంగా ఉండేలా చూడడంతో పాటు వారి కదలికలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. ఎంఈవో వేణుగోపాలరావు మాట్లాడుతూ ఆత్మరక్షణ, యోగాపై మక్కువ పెంచుకునేలా పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో ఇందిరాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఎంఈవో–2 బుద్ద శివనాయుడు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

మునగపాక: ముందుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొన్న సంఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం తెల్లవారుజామున అనకాపల్లి నుంచి మునగపాక మీదుగా రాంబిల్లికి రాయి లోడుతో లారీ వెళ్తుంది. మునగపాక దరికి వచ్చేసరికి అనకాపల్లి నుంచి వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు లారీని తప్పించబోయి వెనక భాగాన్ని ఢీకొట్టాడు. బైక్ అదుపు తప్పడంతో కింద పడిపోయాడు. స్థానికులు ఆయనను అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

పాయకరావుపేట: ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేసి, పరిష్కారానికి కృషి చేస్తానని యూటీఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పట్టణంలోని ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఆమె కలిసి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ నాయకులు ఎం.శ్రీలక్ష్మి, జోగా రమేష్, కట్టా శ్రీరామచంద్రమూర్తి, కట్టా శ్రీను, గర్లంక సతీష్, జి.వి.గోపాలరావు, కోడి నానాజీ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న క్రైస్తవ పుస్తక ప్రదర్శన



క్రైస్తవ పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న మహిళలు

యలమంచిలి రూరల్: మండలంలోని రేగుపాలెం ఎల్ఈఎఫ్ చర్చిలో మంగళవారం క్రైస్తవ పుస్తక ప్రదర్శన ప్రారంభమైంది. వివిధ రకాల క్రైస్తవ సాహిత్యం, విశ్వాసానికి సంబంధించిన పుస్తకాలు ఇక్కడ ప్రదర్శనలో ఉంచారు. ఈ నెల 15 వరకూ కొనసాగనున్న ఈ పుస్తక ప్రదర్శనను పలువురు క్రైస్తవులు వచ్చి ఆసక్తిగా తిలకించారు. పలు భాషల్లో బైబిల్ పుస్తకాలతో పాటు క్రైస్తవ ఆధ్యాత్మిక వస్తువులు, క్రీస్తు విశిష్టతను తెలిపే పోస్టర్లు, డైరీలు, క్యాలెండర్లు ప్రదర్శనకు వచ్చిన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఏసుక్రీస్తు గొప్ప తనం గురించి క్షుణ్ణంగా తెలుసుకునేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఉపయోగపడతాయని బ్యూటీఫుల్ బుక్స్ బిషప్ డాక్టర్ కిరణ్ కుమార్(క్రైస్ట్ సాల్వేషన్ మినిస్ట్రీస్) అన్నారు. యలమంచిలి పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు డాక్టర్ పీటర్ ప్రారంభ ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు కె.పాల్ ఇమ్మాన్యుయేల్ యెలిజర్ రెడ్డి ప్రసాద్, నథేనియల్, జాన్ మార్క్, ఇజ్రాయేల్, పలువురు పాస్టర్లు, క్రైస్తవ మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా జంపమాంబ జాతర



జంపమాంబ అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

యలమంచిలి రూరల్: సోమలింగపాలెంలో మంగళవారం జంపమాంబ అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. పలువురు మహిళలు అమ్మవారికి చీర, జాకెట్టు, పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అమ్మవారిని రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వర్రావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, ఎంపీపీ బోదెపు గోవింద్, పలువురు వార్డు కౌన్సిలర్లు, పార్టీల నాయకులు దర్శించుకున్నారు. జాతరలో భాగంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

పంటల బీమాపై అవగాహన అవసరం



క్షేత్ర పరిశీలన చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పాయకరావుపేట: పంటల బీమాపై అవగాహన అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు అన్నారు. మండలంలోని మాసాహేబుపేట, పెంటకోట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసారు. ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ పథకాల గురించి రైతులకు వివరించారు. వరి పంట బీమా కోసం ఎకరానికి రూ.600, అపరాలుకు రూ.300 చెల్లించాలన్నారు. భారీ వర్ష సూచన ఉన్న కారణంగా రైతులందరూ వరి కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. కోత కోసిన పంటను త్వరగా కుప్పలు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త శ్రీహరిరావు, వెటర్నరీ డాక్టర్ సాయి శంకర్, గ్రామ ఉద్యాన సహాయకులు అజయ్, సతీష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.